


మంచి కథ నాలుగు రకాలు.

ఒక కథ చదువుతూ ముగింపు ట్విస్టు తాలూకు అద్భుతంతో కదిలిపోతే అది సామాన్యమైన మంచి కథ. ఒక కథ చదువుతున్నంతసేపూ 'అబ్బ–ఏం వ్రాసేడ్రా' అనుకుంటూ పెన్సిల్‌తో అక్కడక్కడా అండర్‌లైన్ చేయాలనిపిస్తే అది కేవలం కథనం మధ్యలో రచయిత తొంగి చూడటానికి ప్రయత్నం చేసిన కథ– కథ చదవగానే మనసంతా అదోలాఅయి కనుకొలుకుల్లో నీళ్ళు నిండితే అది ఆర్ద్రత నిండిన కథ. కథ పూర్తయిన క్షణంనుంచీ ఆలోచన మొదలైతే అది ఉత్తమకథ.

నాలుగో లక్షణం నిండిన ఈకథ 'ఓనమాలు'లో ఆర్ద్రత కూడావుంది. ప్రతిమనిషీ.... తన పరి

ధిలో— తను కావాలనుకుంటే అవతలి వాడిని ఎక్స్ప్లాయిట్ చేయగలడు— అలా చేయటం మనిషి ధర్మం. అందులో తప్పులేదు అని మనమందరం నమ్ముతున్న కాలం ఇది. చెయ్యగలిగీ చెయ్యకపోవటం దైవత్వం అని ఒక మాష్టారు చెప్పిన కథఇది. అందుకనే ఇందులో ఆర్ద్రత వుంది అన్నాను.

ఒక డాక్టర్ని తయారు చెయ్యటానికి ఒక విద్యాసంస్థ డొనేషన్ వసూలుచేస్తే తప్పేముంది. అన్న ప్రిన్సిపాల్ వాదనలో మొదట వాస్తవం కనపడుతుంది పాఠకులకి. ఒక కొడుకుని తయారు చేసినందుకు ఒక కొడుక్కి కట్నం తీసుకోనక్కర్లేదు అన్న వాదన- ఆ ముందు భావాన్ని ఫెటేలున పేల్చేస్తుంది.

అందుకే ఇది నాలుగోవర్గపు కథ అయింది.

—యండమూరి వీరేంద్రనాథ్.

ముందుగా వూహించిన సంగతే అయినా శివరామయ్యగారికా వార్త కొండంత ఆనందాన్నే కలుగజేసింది.

ఎంత బడిపంతులు పని చేస్తూ పేదబ్రతుకు బ్రతుకుతూన్నా ఆ క్షణం అతని మనోసామ్రాజ్యం అంతటా నిండి పొంగి పోతున్న సంతోషపు వెల్లువలో ప్రపంచాన్ని జయించిన గర్వం తొణికిస లాడింది.

విద్యను నమ్ముకుని బ్రతుకుతూన్నందుకు సరస్వతీదేవి తనకు అన్యాయం చెయ్యలేదు.

తూర్పు వాకిట్లో పారిజాతం మొక్క దగ్గరగా పాతకాలం నాటి యీజీచైరులో కూర్చున్న శివరామయ్యగారికి ఆ తొలి సంధ్యలో ఎన్నో కొత్త అందాలు గోచరించాయి.

వ్రేళ్ళు నాటుకుని పెరుగుతూన్న భావికాలపు వృక్షానికి కొత్త చిగురులు కన్పించాయి. ఎప్పుడూ ఏ ఆశలూ, ఆవేదనలూ ఎరుగని ఆకాశం కూడ అవతార పురుషుల మేని రంగులో నీలంగా స్వచ్ఛంగా నిర్మలంగా వుంది. రోజూ చూసే సూర్యోదయమే అయినా అందులోని వింత కాంతి. రేపటి ఆశల కిరణాల్లా ద్యోతకమయిందీతనికి. అదే సూర్యోదయంలో కాలచక్ర ప్రగతి కన్పించింది-జానం కనిపించింది. తమ జీవితాలకి వెలుగును చూపే భగవానుడు కన్పించాడు. ఎగిరే పక్షుల్లోనూ, వీల్చే గాలిలోనూ స్వేచ్ఛ కన్పించింది. శివరామయ్యగారి మనసు ఆనందంతో పులకరించింది.

ఆ అనుభూతికి, ఆ ఆనందానికి కారణం ఆయనగారి రెండో పుత్ర రత్నం శ్రీను పదో తరగతి పరీక్ష ప్రథమ శ్రేణిలో పాసవడమే. తూర్పు ఆకాశంలో లేత వెలుగులు విరజిమ్మే సమయానికే పేపరు పట్టుకొచ్చి ఆ సంతోషవార్తను ఆయన చెవిన వేశాడు శ్రీను.

దేవుడి గదిలోంచి గంట వినిపించడంతో లేచి, లోపలికి నడిచారు శివరామయ్యగారు. పారిజాత కుసుమాలతో కృష్ణ విగ్రహాన్ని అలంకరించి, పూజ పూర్తిచేసి వస్తూన్న మహాలక్షమ్మగారు లక్ష్మీదేవిలా కన్పించారాయన కళ్ళకి. ఆమె వదనంలోనూ ఆనందమే- ప్రసాదాన్ని ఆయనకందిస్తూ—

"విన్నారా— ఈ ఏడు పాతికశాతమే పాసయ్యారట- అందులో మనవాడు ఫస్టునొచ్చాడంటే గొప్పే" అంది.

"గొప్పకాక? వాడెవరనుకున్నావ్‌! సత్యం వందలాది విద్యార్థులకు విద్యాదానం చేసే ఉపాధ్యాయుడి కొడుకు. ఇంట ఎర్రని ఏగాని మిగలకపోయినా విద్య చేత గొప్పవారమే మనం" అంటూ ఒంకికున్న లాల్చీని తీసి వేసుకొని బయటకు నడిచేరాయన.

తనకొక్కావల్సిన వాళ్ళకీ; తన మేలును కాంక్షించే వారికి, తన కష్ట సుఖాల్లోనూ ఆలోచనల్లోనూ పాలుపంచుకునే ఆప్తులకి పుత్రరత్నం పాసైన సంగతి చెప్పి ఒక గంటలో తిరిగొచ్చేరాయన.

"మీవాడు ఫస్టున రాకపోతే యింకెవరొస్తారూ? చదువు, సంస్కారం, విజ్ఞత వున్న వంశం మీది. ఆ కుటుంబంలోంచి వచ్చినవాడు ఆ తెలివితేటల్ని పుణికి పుచ్చుకోకుండా ఎలా వుంటాడు." అన్నారంతా.

అవును మరి. ఆర్థిక స్థితిగతులూ, కుటుంబ సమస్యలూ తనను చదువుకోనివ్వలేదుగాని లేకుంటే తను యూనివర్శిటిలో ప్రొఫెసరే అయి వుండేవాడు.

పెద్దవాడు కృష్ణమోహన్ మాత్రం తెలివి తక్కువవాడేం కాదు. కాలేజీలో అడుగు పెట్టిన దగ్గిర్నించీ స్కాలర్ షిప్పులతోనే చదివేడు. తిండి, బట్ట ఖర్చు మినహా వాడి చదువుకేం తను ఖర్చుపెట్టలేదు. వాడు కలెక్టరవ్వాలకి వాళ్ళమ్మ ఆశపడేది. ఐ. ఎ. యస్.కి వెళితే అందులో నిలిచేవాడే. కానీ ఎన్ని తెలివితేటలున్నా దాని వెనుకే అదృష్టం కూడ

కల్సిరావాలి. నొసట గీత ప్రకారం జీవిత గమనం నిరిదేశించబడుతుందని నమ్మేవాళ్ళలో తనొకడు. అనుకోకుండా వచ్చిన బేంకు ఉద్యోగంలో కృష్ణమోహన్ స్థిరపడిపోయాడు. స్వయంకృషి, పట్టుదల వున్నవాడు ఏ రంగంలోవున్నా రాణించగలడు ఆ నమ్మకం తనకుంది. దూరంగా ఒక్కడూ వుంటున్నాడన్న బాధ తప్పితే మరో చింతలేదు వాడిగురించి. నెమ్మదిగా వాణ్ణి ఓ యింటివాడిని చేసేస్తే ఆ బాధా తీరిపోతుంది. ఇద్దరు కొడుకుల మధ్యా ఉన్నది ఒకే ఒక ఆడపిల్ల సరస్వతి. ఎలాగో దానికి తగిన వరుడిని వెతుక్కపోలేదు!

శివరామయ్యగారి తలపులు పరిపరి విధాల పోతున్నాయి.

"వంటయింది. వడ్డించెయ్యమంటారా" అంటూ వచ్చారు మహలక్ష్మమ్మగారు. ఆలోచల్ని అంతటితో కట్టిపెట్టి లేచారు శివరామయ్యగారు.

మధ్యగదిలో శ్రీను ఏదో పుస్తకం చదువుతూ కన్పించాడాయనకు. శ్రీను అందరి పిల్లల్లాంటి ఆట ధ్యాస పిల్లడు కాడు. వాడికి చదువుమీద ఎంతో శ్రద్ధో. సమయం దొరికితే చాలు ఏదో ఒక పుస్తకం తీసి చదువుతూనే వుంటాడు. అదృష్టం కల్సిరావాలేగాని వాడు వాళ్ళమ్మ ఆశయం మేరకు ఐ. ఎ. యస్. పాసై కలెక్టర్ తప్పకుండా అవుతాడు. శివరామయ్యగారి కళ్ళు మెరిశాయి.

భోజనంచేసి యధాప్రకారం స్కూలుకు బయలుదేరారు. ఆరోజంతా సరస్వతీదేవి ఆవహించినట్లే పిల్లలకు పాఠాలు చెప్పారు. సాయంకాలం యింటికి తిరిగొస్తుంటే పోస్టుమేన్ కన్పించి మాష్టారూ మీకో ఉత్తరముంది అని ఓ కవరందించాడు.

ఆ కవరుపై నున్న దస్తూరి చూడ్డంతోనే శివరామయ్యగారికి మనసులోంచి సంతోషం పొంగుకొచ్చింది- హైదరాబాదు నుండి పెద్దకొడుకు కృష్ణమోహన్ రాసినదది. వెంటనే కవర్నిచించి ఏం రాసేడో చదివేయాలనిపించింది కానీ ఆతృతను మనసులోనే అణుచుకుని కవర్ని లాల్చీ

జేబులో పెట్టుకున్నాడు. కృష్ణమోహన్ అందర్లా అక్కడ క్షేమం. ఇక్కడ క్షేమం అంటూ నాలుగు పొడి ముక్కలు రాసి ఉత్తరం ముగించెయ్యడు. వాడు రాసిన ఉత్తరం చదువుతూంటే వాడితో మాట్లాడుతున్న అనుభవం కలుగుతుంది. అంత చక్కగా ఉత్తరాలు రాస్తాడు వాడు. అక్కడి వివరాల్ని విశేషాల్నీ కళ్ళకు కట్టినట్లురాస్తాడు. అటువంటి ఉత్తరాల్ని ఆదరాబాదరగా చదివితే లాభంలేదు. వాలుకుర్చీలో తీరిగ్గా కూర్చుని చదవాలి.

నడకలో వేగం హెచ్చించి యింటికొచ్చి, కాసింత కాఫీతాగి, తాపీగా ఉత్తరం చదవడం మొదలు పెట్టేరు. ఉత్తరమంతా చదివేక, ఆశించిన దానికంటే ఎక్కువ ఆనందం కలిగిందాయనకు.

పెళ్ళి ప్రస్తావనఎప్పుడు తెచ్చినా దాటేస్తూ 'ఇప్పుడు నాకేం తొందర' అనేవాడు యీ ఉత్తరంలో ఆ సంగతి వ్రాయడం ఆశ్చర్యమనిపించింది. ఆ వెంటనే భార్యని పిలిచి ఉత్తరాన్ని పూర్తిగా చదివి వినిపించారు.

'పోన్లెండి. మనవాళ్ళు, మనూరిపిల్లా. మీ అంగీకారమైతే చూసుకుంది కెట్లాగూ వస్తానంటున్నాడు శుభం. మంచిది రమ్మని ఓ కార్డు రాసిపడెయ్యండి అందావిడ.

భార్య మాటలకు సరేనన్నట్లు తలూపి సంతృప్తిగా నిట్టూర్చారు శివరామయ్యగారు.

*　　　*　　　*

శ్రీనివాస్ చాల హుషారుగా వున్నాడు.

ఆరోజు కాలేజిలో చేరేరోజు. ఉన్న ఒక్కగానొక్క ప్యాంటూ, టెరికాటన్ చొక్కా ఉతికి యిస్త్రీ చేయించుకున్నాడు. పదో తరగతి పాస్ సర్టిఫికేటూ, మార్కులలిస్టూ, తదితర సర్టిఫికేట్లూ, పాస్‌పోర్టుసైజు ఫోటోలూ, కాలేజీవారు పంపిన ఇంటిమేషన్ కార్డూ.... కాలేజీ అడ్మిషన్ పైమప్పుడు కావల్సిన అన్ని సర్టిఫికేట్లూ ఒక ఫైల్లో పెట్టుకున్నాడు. అవి కాక హైస్కూల్లో తను డిబేటింగ్‌లోనూ, ఎస్సే రైటింగ్‌లోనూ పాల్గొని

ఫస్టులు తెచ్చుకొన్న సర్టిఫికెట్లు కూడ వాటి అడుగున పెట్టాడు. వాటన్నిటినీ సంతృప్తిగా చూసుకుంటూ మార్కుల జాబితాను మరొక్కమారు చూసుకున్నాడు. సగటున ఎనభై ఆరు శాతం మార్కులొచ్చాయి. ఏ ఒక్క సబ్జెక్టులోనూ ఎనభైకి తగ్గలేదు.

అందుకే వూళ్ళో మొత్తం మూడు జూనియర్ కాలేజీలున్నా మూడింటిలోనూ మంచి కాలేజీ అనుకున్న ఒక్క కాలేజీకే ఎప్లయ్ చేసి వూరుకున్నాడు. ఎంత కాంపిటీషన్ వున్నా తనకు మాత్రం సీటు రావటం ఖాయమనుకున్నాడు. తన స్నేహితులు చాలమంది మూడింటికీ ఎప్లయ్ చేసి, ఏ కాలేజిలో సీటొచ్చినా చాలన్నట్లు చూశారు తను అనుకున్నట్టే తనకు సీటొచ్చింది.

ఈ రెండేళ్ళ కాలేజీ చదువూ తన భవిష్యత్తును నిర్ణయిస్తుందంటారు నాన్నగారు.

ఏమైనాసరే తను యింతకంటే బాగా చదవాలి. నలుగురిలోనూ పేరు తెచ్చుకోవాలి: అనుకున్నాడు.

అతని మనస్సు ఆ క్షణంలో ఆనందడోలికలూగింది.

కాలేజీలో ప్రిలిమనరీ యింటర్వ్యూ పదిగంటలకు కాబట్టి తొమ్మిది గంటలకే బయలుదేరారు తండ్రీ, కొడుకూ.

శివరామయ్యగారు ఆ పూట స్కూలుకి శెలవు పెట్టేశారు. ఆయన కాలేజీలో అడుగు పెట్టేసరికే కాలేజీ ఆవరణంతా కోలాహలంగా వుంది. అక్కడో బోర్డుమీద మెరిట్ ప్రకారం సెలెక్టు చేసిన విద్యార్థుల లిస్టు వుంది. ఆత్రుతగా దాన్ని పరికించారు శివరామయ్యగారు. అందులో నాలుగో పేరే శ్రీనివాస్‌ది.

సరిగ్గా పది గంటలయ్యేసరికి యింటిమేషన్ కార్డులన్నీ కలెక్టు చేసి వరుసగా పిలవడం మొదలుపెట్టారు. శ్రీనివాస్ పేరు పిలవగానే శివరామయ్యగారు కొడుకుని తీసుకొని లోపలికెళ్ళారు. అక్కడ ఒరిజినల్

సర్టిఫికేట్లన్నీ వెరిఫై చేస్తున్నాడో వృద్ధ జంబూకం. అతన్ని చూస్తే అలానే అన్పించింది శివరామయ్యగారికి. అన్ని సర్టిఫికేట్లూ చూశాక, "అప్లికేషన్ ఫారాన్ని ప్రిన్సిపాల్‌గారి సంతకంకోసం పంపిస్తాం. యీ లోగా మీరు ఫీజు చెల్లించి రండి." అంటూ ఓ చిన్న స్లిప్‌ను శివరామయ్య గారి చేతికందించాడతను.

"ఫీజు ఎంత కట్టాలో సెలవిస్తే...." అంటూ ఆగిపోయారాయన.

'అందులోనే వుంటుంది చూడండి' జవాబుచెప్పి తన పనిలో తాను లీనమయ్యాడా వృద్ధ జంబూకం.

స్లిప్ వంక చూశారు శివరామయ్యగారు. అందులో రెండే అంకెలా న్నాయి. మొదటిది రిజిస్ట్రేషన్ నెంబరు—రెండోది అది చెల్లించాల్సిన ఫిజు? అతని నవనాడులూ ఒక్కసారి కృంగిపోయినట్లయ్యాయి. ఆ అంకె అరువందల ఎనభై!

శివరామయ్యగారికి ఒక్క క్షణం అంతా అయోమయమైపోయినట్లు తోచింది. ఎక్కడోఏదో పొరపాటు జరిగింది. లేదా తన లెక్కయినా తప్పయి వుండాలనుకున్నారు.

'ఇది జూనియర్ ఇంటర్మీడియెట్‌కి కట్టాల్సిన ఫిజేనా' అడిగేరు అనుమానంగా.

'అవును' అంది వృద్ధ జంబూకం తలెత్తకుండానే.

"మరి....మీరిచ్చిన ప్రాస్పెక్టస్ ప్రకారం నూట ఎనభయ్యే అవు తుంది కదా"

ఈమారు వృద్ధ జంబూకం కుందేలుపిల్ల వైపు మృగరాజు చూసి నట్లు కోపంగా చూశాడు శివరామయ్యగారి వంక.

'అవును ఫీజు నూట ఎనభయ్యే, కాలేజీ బిల్డింగ్ ఫండు ఐదు వందలు. డొనేషన్ల విషయం ప్రాస్పెక్టస్‌లో వుండవు కదా' అన్నాడు అతి సౌమ్యంగా మారిపోతూ.

'మరి డొనేషన్ చెల్లించకపోతే ....' అమాయకంగానేవుందా ప్రశ్న.

'ఈ కాలేజీలో చేరాలంటే అది చెల్లించాల్సిందే,' జవాబు మాత్రం కరుకుగావుంది.

శివరామయ్యగారికి ఏంచెయ్యడానికి పాలుపోలేదు. గది బయట కొచ్చేసి, ఆవరణలో నీడ నివ్వకుండా ఎత్తుగా పెరిగిన అశోక చెట్లదగ్గర నిలబడ్డాడు. పూర్వం తను చదువుకున్న స్కూల్లో ప్రహరీ అంచునా మామిడి, సపోటా, జామి, మొదలైన ఫల వృక్షాలుండేవి. అవి పిల్లలకు పళ్ళునిచ్చేవి నీడనిచ్చేవి. ఆ కొమ్మలరెమ్మలలో ఎన్నో ఆనందాల్ని పంచేవి! ఇప్పుడా రోజులు మారిపోయాయి. నాగరికత ప్రబలిపోయింది. కాగితం పూల అందాలే నిజమైన అందాలయ్యాయి. ఈ నీడనివ్వని నిరుప యోగమైన చెట్లలాగే, యీ అందమైన ఎన్నో అంతస్తులున్న కాలేజీలు కూడ విద్యార్థించే సామాన్యులకు అందుబాటులో లేకుండా పోతున్నాయా అన్పించింది. అదే నిజమైతే విద్యకు డబ్బువిలువ కాక మరేముంటుంది? విద్యను బోధించే ఒక ఉపాధ్యాయుడై యుండి కూడ తనవంటివారు దానిని సమర్థించి సహించవలసిందేనా? శివరామయ్యగారి మనసులో గాంభీర్యం, హృదయంలో నిబ్బరం, ధైర్యం ఒక్కసారి నిండుగా తొణికిసలాడేయి. అంతే! మరుక్షణంలో ఆయన ప్రిన్సిపాల్‌గారిరూంలో వున్నారు.

'యస్,కమిన్. అని లోపలకాహ్వానించి కూర్చోమని కుర్చీ చూపించారు ప్రిన్సిపాల్‌గారు. కుర్చీలో కూర్చుంటూ ఆయనవంక చూసారు శివరామయ్యగారు—

వయసు ఏభై అయిదేళ్లుండొచ్చు– ఎర్రగా దృఢంగా వున్నారు. నెరసిన క్రాఫింగూ; నుదుట విభూతీ; తెల్లని పంచి, లాల్చీ, కండువాలో హుందాగావున్నారు.

3)

తన ముందున్న అప్లికేషన్ల మీద సంతకాలుచేసి పంపేసి, 'చెప్పండి' అంటూ శివరామయ్యగారివేపు చూశారాయన.

'మా అబ్బాయి శ్రీనివాస్‌ని మీ కాలేజీలో చేర్పిద్దామని వచ్చాను—సెంత్‌లో ఎనభై ఆరు పర్సెంట్ మార్కులొచ్చాయి. మీరు ఎన్నికచేసిన మెరిట్ లిస్టులో నాలుగోవాడు."

"వెరీగుడ్ చేర్పించండి. ఫీజు కట్టేసేరా?"

"బిల్డింగ్ ఫండ్ ఐదొందల రూపాయలు కంపల్సరిగా కట్టాలంటున్నారు—నేనందుకు ప్రిపేరై రాలేదు. మీరనుమతిస్తే ప్రస్తుతం ఫీజు మాత్రం కట్టగలను" అన్నారు—

ప్రిన్సిపాల్‌గారీమారు ఆశ్చర్యంగా చూశారు. ఆయనకి కేసు కొత్తదిగా అన్పించింది. ఫీజు ఎంతంటే అంత ఎప్పుడంటే అప్పుడు క్యూల్లో నిలబడి కట్టేవారేగాని యిలా కట్టలేనని చెప్పేవారింతవరకూ తారసపడ లేదాయనకు.

"చూడండిసార్, ఈకాలేజీ స్థాపించి అయిదేళ్ళయింది. ఇంత తక్కువ వ్యవధిలోనే విద్యచేత, క్రమశిక్షణచేత మంచి కాలేజీ అని పేరు సంపాదించుకుంది. ఒక మంచి విద్యా సంస్థను అభివృద్ధి పరచడానికి సహృదయులైన మీవంటివారి సహకారం లేకపోతే ఎలా? అని ప్రశ్నించారు.

"నిజమే విద్యాసంస్థను అభివృద్ధి చేయడానికి అందరూ సహాయ సహకారాలనందజేయాలి. కానీ అది నిర్బంధంగా కాకుండా సహకరించే వారి ఆర్థిక స్థితిగతులను బట్టివుంటే బావుంటుందని నా అభిప్రాయం. కొన్ని కాలేజీల్లో డొనేషన్లు తీసుకుంటారని నేనూ విన్నాను. కానీ మెరిట్ విద్యార్థులనుండికూడ యింత ఎక్కువ మొత్తం వసూలు చేస్తారనివూహించలేక పోయాను. నామట్టుకు నాకు కేవలం ఫీజులు చెల్లించి, పుస్తకాలు కొని చదివించడమే గొప్ప. కాకుంటే కాస్త వ్యవధి తీసుకుని శక్త్యానుసా

సారం విద్యాసంస్థకు తోడ్పడగలను. మీకుతెల్సు యీ దేశంలో స్కూలు మాష్టారెంత స్థితిపరుడో! నేనొక స్కూలు మాష్టార్ని, నా గురించి ప్రత్యేకంగా ఆలోచిస్తారనే మిమ్మల్ని కల్సుకున్నాను" అన్నారు శివరామయ్యగారు.

ఒక్క క్షణం ప్రిన్సిపాల్‌గారేం మాట్లాడలేదు. ఆ తర్వాత యిలా అన్నారు.

"చూడండి మాష్టారు. మీకిపాటికి విద్యా సంస్థల నిర్వహణలోని లోటుపాట్లు గురించి తెలిసే వుండాలి. మాదొక రకంగా ప్రైవేటు సంస్థ. ప్రభుత్వం గుర్తించిందేగాని నిధులివ్వటంలేదు. అంచేత ఫండ్స్ సమకూర్చుకోవడం తప్పనిసరి అవుతోంది. మీ అబ్బాలాంటి తెలివైనవిద్యార్థి మా కాలేజీలోనే చదవాలి. చదివి గొప్పవాడు కావాలి మీకు మాకు పేరు తేవాలి. అందుకోసమైనా మీరీ ఖర్చుపెట్టక తప్పదు. అయితే యిక్కడ మీరొక్క సంగతి గుర్తించాలి. నిర్బంధంగా ఫండ్ వసూలు చేస్తున్నామని దీన్ని మీరొక వ్యాపార సంస్థగా భావించకూడదు. ఇక్కడ సీటొచ్చిన విద్యార్థి తప్పకుండా ఏ ఇంజనీరో, డాక్టరో సైంటిస్టో, కలెక్టరో అయి తీరుతాడు. ఆ గౌరవ ప్రతిష్ఠలు నిలుపుకోడానికే ఎంతమంది 'ఫండ్' పేరిట సీటుకోసం వేలకు వేలు గుప్పిస్తామన్నా మేము తెలివైన విద్యార్థులనే తీసుకోవాలని నిర్ణయించుకున్నాం. ఆలోచించండి. పిల్లల అభివృద్ధి కోసం, చదువుకోసం మనం కొన్ని కష్ట నష్టాలను భరించక తప్పదు" అంటూ ఆగేరాయన—అది ఒక చిన్న పిల్లాడికి చేసిన హితబోధలా వుందే గాని ఒక కాలేజి ప్రిన్సిపాల్ ఒక విద్యార్థి తండ్రితో మాట్లాడినట్లు లేదనిపించింది శివరామయ్యగారికి.

ఎన్ని కారణాలున్నా డొనేషన్ రూపంలో తను ఐదువందల రూపాయలు కట్టడం అసంభవం. తలకు మించిన పని—కట్టకపోతే పనిఅయ్యేట్టు లేదు. ఏంచెయాలి? జరిగేదేదో జరుగుతుంది. అంచేత మనసులోని

మాటను దాచుకోవాలనుకోలేదు. "చూడండి సార్— నాగురించి చెప్పుకోవడం కాదుగానీ రెండేళ్ళ క్రితం ఉత్తమ ఉపాధ్యాయ బిరుదాన్ని ప్రభుత్వం నించి అందుకున్న వాణ్ణి. చదువు చెప్పటమే గాని దాని ద్వారా డబ్బు సంపాదించాలన్న కోరిక లేనివాణ్ణి. డబ్బే జీవితానికి ముఖ్యం కాదనుకున్నవాణ్ణి— మధ్యతరగతి కుటుంబీకుణ్ణి. మనమంతా సరస్వతీపుత్రులమని నమ్మినవాణ్ణి. ఆ దృష్టితో చూసి అయినా మీరు నా అభ్యర్థనను మనించాలి. కేవలం డొనేషన్ కట్టలేదన్న కారణంగా ఒక మంచి విద్యాసంస్థ ఒకతెలివైన విద్యార్థిని వెనక్కు పంపే యడం న్యాయం కాదు.విద్యాలయాలు తెలివైన పేద విద్యార్థులకు చేయూత నివ్వాలి. 'డబ్బుంటేనే చదువు' అన్న అపోహను పోగొట్టాలి. మీరు సూళ్ళకే ప్రాధాన్యత నిస్తారని యిక్కడ సీటు ఖాయమని మరోచోట దరఖాస్తు చేయలేదు. నా అసమర్థత కారణంగా విలువైన వాడి సంవత్సర కాలాన్ని వృధా చెయ్యలేను. మీరు మనిస్తే ఏ బాధలైనాపడి ఓ రెండొందలు మీ ఫండ్‌కి చెల్లిస్తాను. ఓ నెల గడువివ్వండి" అని, సమాధానం కోసం ఆత్రంగా ప్రిన్సిపాల్‌గారి ముఖంలోకి చూశారు శివరామయ్యగారు.

ఒక్క క్షణం ఏమి మాట్లాడలేదు ప్రిన్సిపాల్‌గారు. ఆ తర్వాత దించిన తలను ఎత్తకుండానే ఇలా అన్నారు. "మాష్టారు— ఎంత ప్రిన్సిపాల్‌నయినా, ఎన్ని వ్యక్తిగత అభిప్రాయాలున్నా నేనూ ఉద్యోగినే— మీ అభిప్రాయాలు కొన్నిటితో నేనూ ఏకీభవిస్తాను. కానీ కొన్ని కారణాల చేత నేనశక్తుడని. నా చేతిలో వున్నది నేనొక యాభై రూపాయలు తగ్గించగలను. మీ కోసం ప్రత్యేకించి రెండురోజుల గడువివ్వగలను. అంతే నేను చేయగలిగింది. మీ వాడికి మంచి భవిష్యత్తు కలగాలని ఆశీర్వదిస్తున్నాను." అంటూ తన పనలో తాను లీనమయ్యారు.

నిస్సహాయంగా లేచి బయటకొచ్చేశారు శివరామయ్యగారు.

*　　*　　*

ఇల్లుజేరిన శివరామయ్యగారి మనసు మనసులో లేదు. జరక్కూడని దేదో జరిగినట్టు భావించారు. ఓటమితోనూ అవమానం తోనూ కుంచించుకుపోయారు.

'మరి యీ యేడాదికి కాలేజిలో చేరేది లేదా నాన్నా' అనడిగాడు శ్రీను కాలేజీగడప దాటుతూంటే. వాడి రెండు కళ్ళలోనూ సుళ్ళు తిరుగుతున్న బాధను చూడలేకపోయాడు తను. ఏం చెప్పగలడు? ఎలా ఓదార్చగలడు వాడిని? మౌనమే అన్నిటికి సమాధానం- సాయంకాలం వరకూ ఎక్కడెక్కడో తిరిగాడు. ఎవరెవర్నో కల్సుకున్నాడు. మనసు మరింత బరువెక్కిందేగాని తేలికపడలేదు. ఆకలవటం లేదని అన్నం కూడ మనేసి మంచం మీద మేను వాల్చాడు. అప్పుడాయన మదిలో పెద్దకొడుకు కృష్ణమోహన్ మెదిలాడు. లేచి, డైరీలో దాచిన కొడుకు రాసిన ఉత్తరాన్ని మరొక్కమారు తీసి చదవటం మొదలు పెట్టేరు.

నాన్నా!

మీకో కొత్త సంగతి తెలియజేయాలనే యీ ఉత్తరంరాస్తున్నాను. ఎన్నాళ్ళగానో మీరూ, అమ్మా నా పెళ్ళిని గురించి ఆలోచించమని రాస్తూ వచ్చారు. పెళ్ళిని గురించి నాకు కొన్ని నిర్దిష్టమైన అభిప్రాయాలున్నాయి. కనుకనే యిన్నాళ్ళు మౌనం వహించాను. నాకు అన్ని విధాలా నచ్చి, నా ఆలోచనలకు సరిపోయే అమ్మాయి, తారసపడక మీకు నేనేం జవాబు చెప్పలేదు. ఇప్పుడు తారస పడిందనే అనుకుంటున్నాను. వాళ్ళది మన వూరే-మనవాళ్ళే- చదువు, సంస్కారమూ ఉన్న కుటుంబమే- మీరంగికరిస్తే ఆ అమ్మాయిని మీకు చూపించడానికి వచ్చేవారం వస్తాను ఏమైనా మీ నిర్ణయమే తుదినిర్ణయం.

మీ కృష్ణ.

ఉత్తరం చదివిన శివరామయ్యగారి మనసులో ఆనందంతోపాటు ఒకింత గర్వం కూడ చోటు చేసుకుంది. 'నా పిల్లలు రత్నాలు. పెద్దల

మాటలకు విలువిచ్చే సంస్కారులు' అనుకున్నారు. సరిగ్గా అదే సమయంలో మరో ఆలోచన కూడ మెరుపులా మెరిసింది అవును! వచ్చేది రేపేగా! శ్రీను విషయమై వాడొక పరిష్కారాన్ని ఆలోచించకపోడు అనుకున్నారు. ఆ సమయంలో ఆయన దృష్టి, ముందుగదిలో చాపమీద బోర్లా పడుకున్న శ్రీను మీద పడింది పొంగి వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ వెక్కుతున్నాడు వాడు.

శివరామయ్యగారి మనసు ఒక్కసారి ద్రవించి పోయింది. లేచి కొడుకు దగ్గరకు వెళ్ళి వాడి తల నిమురుతూ, "ఒరేయ్ శ్రీనూ, ఎన్ని యిబ్బందులెదురైనా నీ చదువు మాత్రం ఆపెయ్యను లేరా.నన్ను నమ్ము" అన్నారు. శ్రీను తలెత్తి ఆయన ముఖంలోకి వింతగా చూశాడు. వాడి కళ్ళలో ధారాపాతంగా నీళ్ళు!

"అవును. నన్ను నమ్ము!" అంటూ తన కళ్ళలో తిరుగుతున్న నీటిని ఆ పసివాడికి చూపించడం ఇష్టంలేక గిరుక్కున వెనుదిరిగి వచ్చేశారాయన. ఆ రాత్రి కలత నిద్రే అయింది శివరామయ్యగారికి.

మర్నాడు ఉదయం ట్రైన్‌లో వచ్చేడు కృష్ణమోహన్. ఇంట్లో మార్పు లేకపోయినా మనుషుల్లో కొత్తగా గాంభీర్యాన్ని పసిగట్టెడు. చెల్లెల్ని చాటుగా పిలిచి విషయాల్ని సేకరించేడు. ఆయింటి ఆర్థిక పరిస్థితులు చెల్లెలు ద్వారానే తెల్సుకుంటాడతడు. ఎంత యిబ్బందొచ్చినా తండ్రి తనతో డబ్బు ప్రస్తావన తేడని అతనికి బాగా తెల్సు.

అందుకే పరిస్థితిని బాగా అర్థం చేసుకుని మధ్యాహ్న భోజనమయ్యాక తండ్రి గదిలోకి వెళ్ళి ఆ విషయాన్ని ప్రస్తావించేడు. 'అపుడే నీకెట్లా తెల్సింది విషయం' అన్నట్లు చూశారాయన కొడుకు వైపు.

'శ్రీను చదువు విషయమై నీకు సమస్యేం లేదు నాన్నా ఇక్కడ కాకపోతే వాడు నాదగ్గరుండి చదువుతాడు. ఇవాళ కాకపోయినా మరో సంవత్సరం పోయాకైనా మీరంతా నా దగ్గర కొచ్చేసే వారేగా.

అనవసరంగా మనసుపాడు చేసుకోకండి." అంటూ ఎంతో తేలిగ్గా ఆసమస్యను పరిష్కరించేసిన కొడుకువైపు చూస్తూ మాటలు రాని బొమ్మల్లే వుండిపోయారు శివరామయ్యగారు.

*  *  *

గుమ్మంలో అడుగు పెడుతూనే పెళ్ళికూతురి తండ్రిగా పరిచయమైన వ్యక్తిని చూసి ఆశ్చర్యపోలేదు శివరామయ్యగారు. ఆయన ప్రిన్సిపాల్‌గారు. కాని ప్రిన్సిపాల్‌గారు మాత్రం ఒక్కక్షణం మాటలురాని స్థితిలో కొయ్యబారిపోయి, తర్వాత తేరుకొని పశ్చాత్తాప పడి వారిని సాదరంగా లోపలికాహ్వానించారు.

పెళ్ళిచూపుల ఏర్పాట్లు ఘనంగానే వున్నాయి. చూపులూ, పలహారాలు అయ్యేక మధ్యవర్తిగా వున్నాయన మధ్యలోకొచ్చి, "పెళ్ళికూతురు అన్నదమ్ముడూ, పెళ్ళికొడుకూ స్నేహితులు కాబట్టి, పెళ్ళికొడుకూ, పెళ్ళికూతురు అంతకుముందే చూసుకుని యిష్టపడ్డారు కాబట్టి వారిద్దర్ని ఒకటి చేసే ప్రయత్నంలో మిగతా విషయాలు మాష్టారుగారు నిర్మొహమాటంగా మాట్లాడితే బావుంటుందని నా అభిప్రాయం" అన్నాడు.

"ఇందులో ఇంక మాట్లాడేదేముంది?" అన్నారు శివరామయ్యగారు. ఆ మాటకి ప్రిన్సిపాల్‌గారూ, కృష్ణమోహనూ ఆయనవంక అదోలా చూశారు.

"అదికాదు మాష్టారు. పిల్లలెలాగూ యిష్టపడ్డారు. కాబట్టి కట్నకానుకల విషయం మీరు తేలిస్తే ముహూర్తాలు పెట్టుకుందాం. అబ్బాయి వుద్యోగ యోగ్యతలనుబట్టి పదిహేనువేల వరకూ కట్నం ఎవరైనా యిస్తారు. కానీ నాకంత శక్తిలేదు. పదివేలిచ్చి పెళ్ళి చేయగలను మీరు అంగీకరిస్తే అది మా అదృష్టమే" అన్నారు ప్రిన్సిపాల్‌గారు ఆయనవైపు ఆశగా చూస్తూ.

శివరామయ్యగారు అతని కళ్ళలోకి చూశారు. అభ్యర్థిస్తున్నట్లు

వున్నాయాకళ్ళు. కొడుకువైపు చూశారాయన!" నాకు నచ్చింది. కానీ మీ 'నిర్ణయమే తుది నిర్ణయం' అన్నట్లున్నాయి అతని చూపులు.

"ఇవి జీవితాలు బావగారూ. ఇందులో వ్యాపార సరళిలో డబ్బు ప్రసక్తి రాకూడదు. నేను నా కొడుకుని నా బాధ్యత మేరకు చదివించి పెద్దవాణ్ణి చేశాను. వాడి అదృష్టం కొద్దీ మంచి ఉద్యోగమొచ్చింది. నాకూ ఒక ఆడపిల్లవుంది. కానీ కూతురిపెళ్ళి కొడుక్కి తీసుకున్న కట్నంతో చేయాలన్న వూహ నాకులేదు. ఎవరి జీవితాలు వారివి! డబ్బు అవసరం ఎంతున్నా వాడి యిష్టాన్ని కాదనలేను. మీ అమ్మాయి వాడు కోరుకున్న జీవిత భాగస్వామి. జీవితాలకి డబ్బు అవసరమే కానీ డబ్బే జీవిత సర్వ స్వం కాదు. నా యీ అభిప్రాయంలో ఎప్పుడు మార్పురాదు. ముహూ ర్తాలు పెట్టించండి" అంటూ లేచారు.

అందరి ముఖాల్లోనూ ఆనందం తాండవించిందా ఆ క్షణంలో.

మర్నాడే ముహూర్తాలు పెట్టించుకొచ్చి శివరామయ్యగార్ని యే కాంతంగా కలిశారు ప్రిన్సిపాల్‌గారు. "నన్ను క్షమించండి మాష్టారూ అభిప్రాయాలెన్నివున్నా మీలా పాటించడం చేతకాలేదిన్నాళ్ళు. మనుషుల లోని విజ్ఞానాన్ని, మంచితనాన్ని డబ్బుతోకొలవలేమన్నది నిజం. నేనా రోజు ఆస్థానంలో వుండి అలా జవాబు చెప్పినందుకు సిగ్గుపడుతున్నాను. జీవితమనే చదువులో యీనాడు మీ దగ్గర ఓనమాలు నేర్చుకున్నాను. నా అభిప్రాయాలను నేనే గౌరవించే స్థితికెదగాలని నిశ్చయించుకున్నాను. అందుకే నేనా కాలేజీ ఉద్యోగానికి రాజీనామా చేశాను."

నమ్మలేనట్లు అతని ముఖంలోకి ఆశ్చర్యంగా చూశారు శివరా మయ్యగారు. ఆయన నయనాలు శాంతిగా కాంతితో మెరుస్తున్నాయి!

(ఆంధ్రసచిత్ర వారపత్రిక. 8-14 నవంబర్' 1985. దీపావళి కథల పోటీలో రెండవ బహుమతి పొందినది)